సాక్షి పల్నాడు

మంగళవారం । 9 । జూలై । 2024



విజిలెన్స్ తనిఖీలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు కలసి సోమవారం తనిఖీలు నిర్వహించారు.



ఉర్దూ పాఠశాలల సందర్శన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎంపీపీ ఉర్దూ పాఠశాల, జడ్పీ ఉర్దూ పాఠశాలను సమగ్ర శిక్ష అసిస్టెంట్ స్టేట్ ఐఈడీ కోఆర్డినేటర్ జి.మల్లికార్జున సందర్శించారు.



ఆక్రమణల తొలగింపు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో గాంధీ పార్కు రోడ్డులో ఆక్రమణలు తొలగింపు సోమవారం కొనసాగింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ జడ్.సుధాకర్ పరిశీలించారు.

న్యూస్‌రీల్

హెల్మెట్ ధరించక పోవటం నేరం



నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనంలో దకులు హెల్మెట్ ధరించక పోవటం ప్రమాదకరమే కాదు నేరం కూడా అని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ ఎన్.సత్యశ్రీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అదనపు జిల్లా కోర్టు హాల్లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మోటారు వాహనాలు నడిపే వారు మాత్రమే కాకుండా వెనుక కూర్చున్న వారు కూడా విధిగా హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. న్యాయమూర్తులు పూర్ణిమ, ఆశీర్వాదం పాల్, ప్రవల్లిక, ఎంపీప్ రాఘవ్, ట్రాఫిక్ ఎస్ఐ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుల కొనసాగింపునకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి కాంట్రాక్టు పద్ధతిపై కొనసాగేందుకు అర్హులైన అధ్యాపకులు మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు దరఖాస్తులు అందజేయాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 30వ తేదీ నాటికి కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేసిన వారే దరఖాస్తుకు అర్హులని స్పష్టం చేశారు.

యార్డుకు 29,187 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,187 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,159 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 19,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ. 18,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 14,317 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

వైద్య సిబ్బంది పదోన్నతులకు దరఖాస్తు చేసుకోండి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయ పరిధిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ, మేల్) పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీహెచ్ఓ పోస్టులకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎంపీహెచ్ఈఓలు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈఓల సమాచారాన్ని వారి సర్వీసు రిజిస్టర్‌లు, ఇతర వివరాలను ఈనెల 12వ తేదీలోపు గుంటూరు ఆర్డీ కార్యాలయానికి అందజేయాలన్నారు.

విద్యాశాఖ సైట్‌లో ఎన్ఎంఎంఎస్ మెరిట్ కార్డులు

గుంటూరు ఎడ్యుకేషన్: గతేడాది డిసెంబర్ 3న జరిగిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులను ప్రభుత్వ పరీక్షల విభాగ సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం తెలిపారు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో ఉంచిన మెరిట్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, తమ వివరాలు సరిగా ఉన్నవీ, లేనివీ తనిఖీ చేసుకోవాలని సూచించారు. అలాగే ఆగస్టు 31లోపు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత పాఠశాల నోడల్ అధికారితో పాటు జిల్లా నోడల్ అధికారి లాగిన్ ద్వారా ఆమోదింపజేసుకోవాలని తెలిపారు. ముద్రించిన మెరిట్‌కార్డును త్వరలో డీఈఓ కార్యాలయం నుంచి పొందవచ్చన్నారు. ఒకవేళ వివరాల్లో ఏమైనా తప్పులున్నట్లయితే ఆధార్ మిస్ మ్యాచ్ వివరాలను సంబంధిత పాఠశాల హెచ్ఎం ద్వారా డీఈఓ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. విద్యార్థి ఆధార్ విద్యార్థి పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాకు విధిగా అనుసంధానం చేయాలి, డీబీటీ ద్వారా నగదు జమయ్యే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు.

సంక్షేమ ప్రదాత..సదా స్మరామీ

ఘనంగా మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు

- వాడవాడలా వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పించిన అభిమానులు
- పండుగలా కార్యక్రమాన్ని నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ స్థాయి నేతలు
- దివంగత ముఖ్యమంత్రి సేవలను గుర్తు చేసుకున్న నాయకులు, ప్రజలు
- జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు



నరసరావుపేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి



పెదకూరపాడులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకరరావు



పిడుగురాళ్ల కొండమోడు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు

సాక్షి, నరసరావుపేట: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి ఉత్సవాలు సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతల ఆధ్వర్యంలో పండుగలా జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేకులను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం, పండ్లు పంచారు. మహిళలకు చీరలను పంచారు.

నరసరావుపేట...

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితోనే వైఎస్సార్ సీపీ ఏర్పాటైందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకొని నియోజకవర్గంలో డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. పట్టణంలో పది విగ్రహాలతో పాటు దాదాపుగా అన్ని గ్రామాల్లో వేడుకలు చేశారు. 11వ వార్డు ఇన్‌చార్జి సానికొమ్ము రమణారెడ్డి నాయకత్వంలో ప్రకాష్‌నగర్ 60 అడుగులరోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, కేకు కట్‌చేసి, 100మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ పథకాలు రాష్ట్రప్రజల గుండెల్లో ఎప్పటికీ శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. ఆయన స్ఫూర్తితో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పెద్ద ఎత్తున సంక్షేమ ఫలాలను అందజేశారన్నారు. వైఎస్సార్ పోరాటాలే స్ఫూర్తిగా పార్టీని బలోపేతం చేసి మళ్లీ అధికారంలోకి తీసుకొస్తామన్నారు.

వినుకొండ...

రాష్ట్ర ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వైఎస్ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు.



మాచర్లలో నివాళులర్పిస్తున్న నాయకులు

గురజాల...

రాష్ట్ర ప్రజలు మహానేతను ఎప్పటికీ మరిచిపోరని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కొండమోడు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు.

పెదకూరపాడు

ప్రజాసేవే పరమావధిగా, పేదల పెన్నిధిగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించి ప్రజల గుండెల్లో అపర భగీరథుడుగా నిలిచిపోయారని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

చిలకలూరిపేట...

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు.వైఎస్సార్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చిలకలూరిపేట పట్టణంలోని భాస్కర్‌సెంటర్‌లోని డాక్టర్ వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాచర్ల...

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదవర్గాలకు మేలు చేసిన మహానాయకుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిఉన్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పీఆర్కే తండ్రి పిన్నెల్లి వెంకటేశ్వర్‌రెడ్డిలు పేర్కొన్నారు. మాచర్ల పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు.

సత్తెనపల్లి...

పేదల గుండెచప్పుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని గుంటూరు మిర్చియార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

మాజీ ఎమ్మెల్యే యర్రం ఆధ్వర్యంలో..

సత్తెనపల్లి గంగమ్మ గుడి సెంటర్‌లోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వినుకొండలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



చిలకలూరిపేటలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



సత్తెనపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నిమ్మకాయల

డయేరియా ఉధృతం.. పారిశుద్ధ్యం అధ్వానం

- పిడుగురాళ్లలో డయేరియా భయం
- అధిక కేసులు లెనిన్ నగర్, మారుతీ నగర్ నుంచే
- ఇప్పటికే ముగ్గురు మృతి
- ప్రభుత్వ వైద్యశాలలో కిక్కిరిసిన రోగులు
- ఇప్పటికీ రోడ్లవెంట చెత్తకుప్పలు, పారని డ్రైన్ల దర్శనం..



మారుతీనగర్ పీహెచ్‌సీలో బాధితులకు చికిత్స



లెనిన్ నగర్‌లో వాటర్ ట్యాంక్ వద్ద పేరుకుపోయిన చెత్త

పిడుగురాళ్ల: డయేరియాతో పట్టణంలో పలు ప్రాంతాల ప్రజలు అల్లాడిపోతున్నారు. గత ఐదు, ఆరు రోజుల నుంచి డయేరియాతో బాధపడుతున్న రోగుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. ఇప్పటికే సుమారు 32 మంది డయేరియాతో బాధపడుతున్నారు. ముగ్గురు డయేరియాతో మరణించినట్లు అధికారులే చెబుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని మారుతీనగర్, లెనిన్‌నగర్ ప్రాంతాల్లో కేసులు ఎక్కువగా ఉన్నాయి. గత రెండు రోజుల్లో 20 మందికి పైగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో డయేరియా రోగులు చికిత్స పొందుతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే....

పట్టణంలో కార్మికులు నివసించే ప్రాంతాల వద్ద చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోయింది. వర్షానికి తడిచి దుర్వాసన రావటం, వర్షపునీటితో డ్రైన్లు నుంచి చెడు నీరు కలిసి ఇళ్ల వద్దకు చేరి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది. దీంతో ఎక్కువ శాతం చిన్నారులు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు.

- మారుతీనగర్‌కు చెందిన 9 ఏళ్ల షేక్ అబుబకర్ సిద్దిక్ డయేరియాతో మృతి చెందాడు.
- గత రెండు రోజుల క్రితం లెనిన్ నగర్‌లోని హైస్కూల్‌లో లెక్కల మాస్టర్‌గా పని చేస్తున్న దేవరాజు కూడా మరణించినట్లు అధికారులు చెబుతున్నారు.
- ఐదేళ్లే పారిశుద్ధ్య కార్మికుడు బాలకృష్ణ కార్మికుడు కూడా డయేరియాతో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. డయేరియాతో మరణాలు కొనసాగుతుండటంతో పట్టణ ప్రజల్లో భయాందోళన నెలకొంది. మున్సిపల్, ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టిసారించి డయేరియాను పూర్తిస్థాయిలో అదుపులోకి తీసుకొని రావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మా పాప వాంతులతో డీలా పడింది



ఆరు సంవత్సరాల నా కుమార్తె నిద్రలోనే రాత్రి సమయంలో వాంతులు చేసుకోవటంతో ఒక్కసారిగా డీలా పడిపోయింది. దీంతో భయపడి హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని వచ్చాను. వెంటనే వైద్యులు పరీక్షలు నిర్వహించి సెలైన్ బాటిల్ ఎక్కించి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం కాస్త కోలుకుంది.

– ఇరుకుచెర్ల పూజిత, లెనిన్ నగర్, నివాసి

జాప్యం లేకుండా సమస్యలకు పరిష్కారం

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- మీకోసంలో 96 అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరించి, బాధితుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారంలో ఏమాత్రం జాప్యం ఉండరాదని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికను అధ్యక్షత వహించి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారిచే 96 అర్జీలు స్వీకరించారు. తన పరిధిలోని వాటిని తక్షణమే ఆయన పరిష్కరించారు, వీడియో సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులతో ఆయన మాట్లాడి పరిష్కార మార్గం చూపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. పారిశ్రామిక రంగాలు, ఇంజినీరింగ్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిర్ణయించిన మేరకే రవాణా చార్జీలు వసూలు చేయాలి

నెహ్రూనగర్: ప్రభుత్వం ఉచిత ఇసుక రవాణా పథకంలో భాగంగా జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయించిన మేరకే రవాణా ఛార్జీలు వసూలు చేయాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. సోమవారం లారీ, ట్రాక్టర్ల యాజమానులతో ఆర్టీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరు టైర్ల లారీకి 15 కిలోమీటర్ల వరకు రూ.2వేలు, 16 నుంచి 30 కిలోమీటర్ల వరకు రూ.3,500, 31 నుంచి 45 కిలోమీటర్ల వరకు 4,500, 46 నుంచి 60 కిలోమీటర్ల వరకు రూ.5500 వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. 10 టైర్, 12 టైర్ లారీలకు కొద్ది మేర వ్యత్యాసంతో రవాణా ఛార్జీలు ఫిక్స్ చేయడం జరిగిందన్నారు. ట్రాక్టర్లకు రూ.1500 నుంచి రూ.3,500 వరకు మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుందని చెప్పారు.

అప్పుడే మొదలైంది!

సాయంపై మౌనం.. అప్పుల పాలవుతున్న రైతాంగం

- ఖరీఫ్ మొదలై నెల రోజులవుతున్నా అందని పెట్టుబడి సాయం
- అప్పులు చేస్తూ తిప్పలు పడుతున్న రైతన్నలు
- ఏటా రూ.20వేలు ఇస్తామని మేనిఫెస్టోలో కూటమి హామీ
- రైతు భరోసాను అన్నదాత సుఖీభవగా మార్చడం మినహా నిధుల విడుదలపై మీనమేషాలు
- అన్నదాత సుఖీభవపై నేటికీ విడుదల కాని విధివిధానాలు

నరసరావుపేట రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గత ఐదేళ్లు ఏటా ఖరీఫ్ సీజన్ మొదలయ్యే లోపు పెట్టుబడి సాయం మొదటి విడత రూ.7,500 అందుకుని రైతులు ఉత్సాహంగా వ్యవసాయ పనులు మొదలు పెట్టేవారు. జిల్లాలో సుమారు రూ.2.80లక్షల మంది రైతులకు గత ప్రభుత్వం ఏటా సుమారు రూ.350కోట్లు విడుదల చేసింది. అయితే తాము అధికారంలోకి వస్తే ఏటా రూ.20వేల చొప్పున పెట్టుబడి సాయం అందజేస్తామని సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చిన చంద్రబాబు నేడు ఆ ఊసే ఎత్తకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. అధికారం చేపట్టిన తరువాత రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చడం మినహా నిధుల విడుదలకు చర్యలు తీసుకోవటం లేదు. ప్రమాణ స్వీకారం రోజు చంద్రబాబు తొలి ఐదు సంతకాల్లో పెట్టుబడి సాయం పెంపు, నిధుల విడుదల ఉంటుందని ఆశించిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. తరువాత మంత్రివర్గం సమావేశంలో అయినా చర్చిస్తారని ఆశించారు. చివరకు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు నిర్వహించిన తొలి సమీక్షలో కూడా అన్నదాత సుఖీభవపై మాట వరుసకైనా ప్రస్తావన లేకపోవడంపై రైతాంగంలో ఆందోళన నెలకొంది. ఐదేళ్లుగా ఏటా సీజన్‌కు ముందే చేతికి అందే పెట్టుబడి సాయం ఖాతాలో ఎప్పుడు జమ చేస్తారో అంతుబట్టక ఆశగా ఎదురుచూస్తున్నారు.

నాడు అర్హులందరికీ అందేలా..

వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద గత ప్రభుత్వం ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున అందించింది. మేలో రూ.7500, అక్టోబర్‌లో



రూ.4వేలు, మిగిలిన రూ.2వేలు జనవరిలో జమచేసేది. భూ యజమానులకు మాత్రమే పీఎం కిసాన్ కింద కేంద్రం మూడు విడతల్లో రూ.6వేల చొప్పున జమచేసింది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న కౌలుదారులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే సొంతంగా ఏటా రూ.13,500 చొప్పున అందజేసి అండగా నిలిచింది.

పెట్టుబడి వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు..

జిల్లాలో 28 మండలాల పరిధిలో 4.5లక్షల మంది రైతులు 3.5లక్షల హెక్టార్లలో పంటలను సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో సుమారు 3.18లక్షల హెక్టార్ల సాగు జరుగుతుంది. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్నారు. పొలాన్ని సిద్ధం చేసుకునేందుకు, విత్తనాలు, మందులు, ఎరువులు వేసేందుకు నగదు అవసరం. ప్రభుత్వం నుంచి ఇంతవరకు సాయం అందకపోవడంతో పెట్టుబడి కోసం పలువురు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు

నియోజకవర్గం	అర్హులైన రైతులు
సత్తెనపల్లి	42,516
నరసరావుపేట	25,682
చిలకలూరిపేట	27,594
పెదకూరపాడు	47,255
గురజాల	42,202
వినుకొండ	48,510
మాచర్ల	46,422
మొత్తం	2,80,181

పీఎం కిసాన్ యోజనే దిక్కా...?

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా ఖరీఫ్ సాగు పనులకు ముందు అన్నదాత సుఖీభవ అందించి రైతులను ఆదుకోలేకపోయింది. ప్రధానమంత్రి మాత్రం మోదీ సంతకం పీఎం కిసాన్ యోజనపై చేయడంతో వెంటనే రూ.2వేలు చొప్పున పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమచేశారు. ఈ సొమ్ముతో పాటు వ్యవసాయ పనులకు అవుతోన్న నష్టాలను ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో చెప్పినట్లుగా సాయం విడుదలకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

హామీ నిలబెట్టుకోవాలి...



ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన పెట్టుబడి సాయం హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వాటా రూ.2వేలు కేంద్ర ప్రభుత్వం జమ చేసి రెండు వారాలు అవుతుంది. టీడీపీ ప్రభుత్వం చెప్పినట్లుగా రూ.20వేల సాయం హామీకి సంబంధించి ఇప్పటివరకు ఏమీ మాట్లాడం లేదు. వెంటనే అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయాలి. లేకుంటే చాలా ఇబ్బందులు పడతాం.

–అన్నపురెడ్డి వేణుమాధవ రెడ్డి, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం

అప్పు కోసం తిరుగుతున్నా...



దుక్కులు దున్నుకునేందుకు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు చేతిలో నగదు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. గతంలో రూ.20వేలు వస్తుందనే ధైర్యంతో ఎక్కడా అప్పు చేయలేదు. ఇప్పుడు అన్నదాత సుఖీభవ ఎప్పుడు వస్తుందో తెలియక అప్పుకోసం తిరుగుతున్నాం. గతంలో ఐదేళ్లు సీజన్‌కు ముందుగానే సాయం అందేది. ఇప్పుడు కూడా ఈ ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం ఖాతాలో జమ చేయాలి.

–ఇగుటూరి కోటిరెడ్డి, దొండపాడు, నరసరావుపేట మండలం

క్లుప్తంగా

కర్నూలు - శ్రీకాకుళం మ్యాచ్ డ్రా

కర్నూలుకు 3, శ్రీకాకుళంకు 1 పాయింట్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–16 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో కర్నూలు, శ్రీకాకుళం మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆదివారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ ఒక వికెట్ నష్టానికి 30 పరుగులతో సోమవారం చివరిరోజు ఆట ప్రారంభించిన కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని సుమేథ్ భరద్వాజ్ 51 పరుగులు చేశాడు. శ్రీకాకుళం బౌలర్ కందుకూరి మనీష్‌కు 4 వికెట్లు లభించాయి. అనంతరం 296 పరుగుల విజయలక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. జట్టులోని రుత్విక్ సాగర్ 24పరుగులు చేయగా కర్నూలు బౌలర్ బి.మహిత్‌కు 4 వికెట్లు లభించాయి. తొలి ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు నమోదు చేసిన కర్నూలు జట్టుకు 3 పాయింట్లు, శ్రీకాకుళం జట్టుకు 1 పాయింట్ లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి. పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీ తాపతిరావు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో టూరిజం ఉద్యోగి మృతి


రామారావు(ఫైల్)

విజయపురిసౌత్: రోడ్డు ప్రమాదంలో ఏపీ టూరిజం ఉద్యోగి మృతి చెందిన సంఘటన మాచర్ల మండలం ఏకనాంపేట వద్ద ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. విజయపురిసౌత్‌కు చెందిన కొదమగుండ్ల రామారావు(45) పర్యాటక కేంద్రం ఎత్తిపోతలలో కుక్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి విధులు ముగించుకొని విజయపురిసౌత్‌లోని తన ఇంటికి బైక్‌పై వెళుతుండగా ఏకనాంపేట వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం అతి వేగంతో ఢీ కొట్టింది. దీంతో రామారావు కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తెలంగాణ రాష్ట్రంలోని హిల్ కాలనీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ పట్టాభిరామయ్య తెలిపారు.

టీడీపీ మూక దాడులను అరికట్టండి

- గ్రామాల్లో గతంలో ఎన్నడూలేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలే లక్ష్యంగా దాడులు
- కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసిన ప్రజాసంఘాలు
- జిల్లా కలెక్టర్, ఎస్పీలు గ్రామాలను సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పాలని డిమాండ్



జిల్లా కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వస్తున్న కేఎన్‌పీఎస్, ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ఎన్నికల అనంతరం పేద, దళిత, బహుజన, మైనార్టీలపై టీడీపీ మూకలు చేస్తున్న దౌర్జన్యాలు, హింసాత్మక సంఘటనలను వెంటనే నిలిపివేసి వారికి రక్షణ, భద్రత కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు జిల్లా కలెక్టరేట్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పౌరహక్కుల సంఘం నాయకుడు చిలుకా చంద్రశేఖర్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం అధికార టీడీపీ నాయకుల ఆదేశాలతో పలు గ్రామాల్లో పేద, బడుగు, బలహీన వర్గాలపై మూకదాడులు జరిగాయన్నారు. వీటిని ప్రజాసంఘాలు కమిటీగా ఏర్పడి నిజనిర్ధారణ చేయటం జరిగిందన్నారు.

- అచ్చంపేట మండలం వేల్పూరు, సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన మాదిగలు, యానాదులపై పెత్తందారీ శక్తులు మూకుమ్మడి దాడులు చేశారన్నారు.
- కొండూరు, కొత్తపల్లి, చింతపల్లిలో మాదిగ వర్గీయుల ఇళ్లపై పడి ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. కొందరు రౌడీ మూకలతో కలిసి కత్తులు, గొడ్డళ్లు, రాడ్లు, కర్రలు, పెట్రోలు బాంబులతో వారి ఇళ్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలను ధ్వంసం చేశారన్నారు. వారి దౌర్జన్యకాండకు భీతిల్లిన సుమారు 100 కుటుంబాలు గ్రామం విడిచి పారిపోయాయన్నారు.
- మాచవరం మండలం పిన్నెల్లిలో ముస్లిం మైనార్టీలపై దాడిచేసి, వారి ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. నోరులేని మూగజీవాలైన గేదెలపై రాళ్లు వేసి గాయాలపాలు చేశారన్నారు. ఈ దాడులకు రెడ్లు, మాదిగలు, ముస్లింలు, కొందరు బీసీలు గ్రామం విడిచి పారిపోయారన్నారు.
- నరసరావుపేట మండలం యల్లమంద గ్రామంలో యాదవులు, రజకులు, వడ్డెర, దూదేకుల ఇళ్లపై టీడీపీ వర్గీయులు దాడిచేసి ధ్వంసం చేశారన్నారు. దీంతో కుటుంబ యజమానులు గ్రామం విడిచి పరారయ్యారన్నారు.
- కేసానుపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీకి చెందిన మాలలపై దాడిచేయటంతో గ్రామం విడిచిపోయారన్నారు.
- ఈపూరు మండలం పాత మాదిగపల్లిపై దాడిచేసి ఏడుగురు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులపై తప్పుడు ఫిర్యాదులు చేసి కేసులు రిజిస్టర్ చేయించారన్నారు.
- శావల్యాపురం మండలం వేల్పూరు మాదిగపల్లిపై దాడిచేసి నలుగురు యువకులను గాయపరిచారన్నారు. అదే గ్రామంలో మాలలు, ఎరుకలు, పత్రికా విలేకర్లపై దాడిచేసి గాయపర్చారన్నారు. అధికార పార్టీ కక్షసాధింపు చర్యల్లో భాగంగా చేసిన ఈ దాడులు అన్నీ పోలీసుల సమక్షంలోనే జరిగాయన్నారు. బాధితులకు ఏమాత్రం రక్షణ కల్పించలేకపోయారన్నారు. కొందరిని పోలీసులు అరెస్టుచేసి చేయని నేరానికి జైలుకు పంపారన్నారు. దాడులకు పాల్పడిన వారు యథేచ్ఛగా గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. నెలరోజుల వ్యవధిలోనే గతంలో ఎన్నడూలేని విధంగా కనీ వినీ ఎరుగని రీతిలో భీభత్సకరమైన దాడులు జరిగాయన్నారు. అధికార పార్టీ నాయకులతో చర్చించి రాజీచేసుకొని గ్రామాలకు చేరాలని పోలీసులు బాధితులకు సలహా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులైన కలెక్టర్, ఎస్పీలు బాధిత గ్రామాలను సందర్శించి శాంతిని నెలకొల్పాలని, నిందితులపై తగిన చర్యలు తీసుకొని బాధితులను గ్రామాలకు చేర్చి వారికి రక్షణ కల్పించాలని కోరారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేఎన్‌పీఎస్ జిల్లా కార్యదర్శి శిఖినం చిన్న, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు, పల్నాడు రైతు సంఘ నాయకుడు కోలా నవాజ్, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, ఎంఐఎం నాయకుడు షేక్ కరిముల్లా, జి.విజయకుమార్, ఉన్నంరాణి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బంకా వాసుబాబు



సత్తెనపల్లి: పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా అచ్చంపేట మండలం వేల్పూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న బంకా వాసుబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా శాఖ అత్యవసర సమావేశం సోమవారం నరసరావుపేట శంకరభారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు కె.శ్యామ్ మోసెస్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో గతంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఎం.వెంకటేశ్వరరావు వ్యక్తిగత కారణాల వలన రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానంలో బంకా వాసుబాబుని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీఓ 117ను రద్దు చేయాలని, అమ్మకు వందనం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపచేయాలన్నారు. సంఘ బాధ్యులు ఎ.హనుమంతరావు, ఏడుకొండలు, రఫీ, ఖాజావలి, విజయరాజు, కె.అబ్దుల్ సత్తార్, సిహెచ్ ఏడుకొండలు, సత్తార్, సీనియర్ సభ్యులు సీవీఎస్ మణి పాల్గొన్నారు.

అసాంఘికవాదులపై చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విన్నవించిన ఎంఐఎం నాయకులు


కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎంఐఎం నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని కొందరు వ్యక్తులు ఆర్కెస్ట్రా ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నాయకులు షేక్ కరిముల్లా, మౌలాలీ కోరారు. సోమవారం వారు మీకోసం కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతి చేశారు. రాత్రి పూట గంజాయి, మద్యం సేవిస్తూ ప్రజలను భయ భయభ్రాంతులకు గురిచేస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి నగర బహిష్కరణ చేయాలని కోరారు. అలానే పొట్టకూటి కోసం ఆర్కెస్ట్రాలో పనిచేసే మహిళలకు జీవనోపాధి కల్పించి, ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. దీనిపై కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పందించి వెంటనే ఒక కమిటీ వేసి ఆ కమిటీ ద్వారా ఎంతమంది ఆర్కెస్ట్రా నిర్వాహకులు ఉన్నారు, వారిలో ఎంత మంది మహిళలు ఉన్నారో గుర్తించి, వారికి తప్పకుండా జీవనోపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారని వారు మీడియాకు తెలిపారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడి


ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు

పిడుగురాళ్ల: వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు పిడుగురాళ్ల పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలపై సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా షాపు యజమానుల వద్ద సోర్స్ సర్టిఫికెట్ లేని స్టాక్ అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ స్టాక్ విలువ సుమారు రూ.6,58,740 ఉందని అధికారులు తెలిపారు. అలాగే రైతులకు ఎమ్మార్పీ కంటే అదనంగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మినట్లయితే దుకాణాల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఈసందర్భంగా అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీలలో వ్యవసాయశాఖ ఏడీఏ వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఎస్ఐ డి. రవికుమార్, ఏఓ ప్రవీణ్ కుమార్, పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ నందిపాటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లపై వేధింపులు ఆపండి

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సీపీఎం నాయకులు


కలెక్టరేట్‌లో మీకోసంలో ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై చేస్తున్న రాజకీయ వేధింపులు వెంటనే మానుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా రాజకీయ వేధింపులు జరుగుతూనే ఉండటం శోచనీయమన్నారు. సోమవారం కలెక్టరేట్ మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. అనంతరం విజయకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ వేధింపులు, కక్షపూరిత రాజకీయాలు ఉండవని చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో టీడీపీ, జనసేన నాయకులు తమ అనుయాయులకు ఉద్యోగాలు కట్టబెట్టేందుకు స్కీం వర్కర్లు, కాంటాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. బలవంతంగా రాజీనామాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, చేయకపోతే దూషించడంతోపాటు భౌతికంగా దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలను సెంటర్ నుంచి బలవంతంగా లాగటం, కేంద్రాలకు తాళాలు వేయడంతోపాటు ఆశ వర్కర్లపై ఆయా మండల వైద్యాధికారులకు ఫిర్యాదు చేసి తొలగించాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాలలో రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని వీటిపై జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేసి చిరు ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. వేధింపులు ఆపకపోతే స్కీమ్ వర్కర్లు, ప్రజా సంఘాలను ఏకం చేసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నాయకులు ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయ నాయక్, సరికొండ వెంకటేశ్వర రాజు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోట సాయి కుమార్ పాల్గొన్నారు.

మోసం చేశారు.. న్యాయం చేయండి

- ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల మొర
- వినతులు స్వీకరించిన జిల్లా ఎస్పీ మలికా గార్గ్


బాధితుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ మలికా గార్గ్

నరసరావుపేట: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ఎస్పీ మలికా గార్గ్ అధ్యక్షత వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో అత్యధికంగా కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం, కుటుంబ తగాదాల సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నాయి.

ప్రమోషన్ ఇప్పిస్తానని రూ.20లక్షలు తీసుకొన్నారు..



నేను కలెక్టరేట్‌లో సర్వే డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నాను. గుంటూరులో కలెక్టరేట్ ఉండగా మా డిపార్టుమెంట్‌లో పనిచేసే మహిళ ఒకరు ఏడేళ్ల క్రితం ప్రమోషన్ ఇప్పిస్తానంటూ నా వద్ద నుంచి రూ.20లక్షలు తీసుకుంది. నా భర్త వ్యక్తిగత రుణం, నా బంగారం కుదువ పెట్టి డబ్బులు ఇచ్చాను. డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తూ డబ్బులు ఇవ్వడం లేదు. ఇప్పుడా మహిళ ఇక్కడే పని చేస్తుంది. దయచేసి డబ్బులు ఇప్పించి నా కుటుంబాన్ని ఆదుకోండి.

–బి.లక్ష్మీకోటమ్మ, అంధురాలు, నరసరావుపేట

ఇంటిని తాకట్టు పెడితే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు



నాకు డబ్బులు అవసరమై పట్టణానికి చెందిన ఓ మహిళ వద్ద ఇంటిని తాకట్టు పెట్టి ఒకసారి రూ.5లక్షలు, మరోసారి రూ.2లక్షలు తీసుకున్నా.. ఇప్పటివరకు రూ.5.5లక్షలు చెల్లించా. అయితే తాకట్టు పేరుతో రావిపాడులో నాకున్న ఇంటిని ఏకంగా తనపేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంది. నేను మిగతా డబ్బులు కట్టేందుకు సిద్ధంగా ఉన్నా. నా ఇంటిని నాకు రిజిస్ట్రేషన్ చేయించండి.

– బందెల మరియకుమారి, అంధురాలు, రావిపాడు, నరసరావుపేట మండలం

మిర్చి డబ్బులు ఇవ్వకుండా మోసం

రైతుల దగ్గర రూ.1.42 కోట్ల మిర్చి కొనుగోలు చేసి గుంటూరుకు చెందిన రవికుమార్‌కు విక్రయించగా రూ.90 లక్షలు ఇచ్చి మిగిలిన రూ.48.63లక్షలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. ఆ డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి.

– అంబటి నరసింహారావు, పెదపాలెం, అచ్చంపేట మండలం

పేదల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హనుమంత్ నాయక్


శ్రీరాంపురంతండాలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హనుమంత్ నాయక్ తదితరులు

వెల్దుర్తి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ పేర్కొన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం మండలంలోని శ్రీరాంపురం తండా గ్రామంలో ఉన్న ఆయన విగ్రహానికి హనుమంతు నాయక్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మహానేత వైఎస్సార్ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి వాటిని అమలు చేసి, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిఉన్నారన్నారు. వైఎస్సార్ నిరంతరం పేద ప్రజల అభివృద్ధి కోసం తపన పడ్డారన్నారు. ఆయన పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించి పులిహోర, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో మాజీ సర్పంచ్‌లు కేతావత్ హనుమానాయక్, పాతలావత్ లక్ష్మానాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు కాంఢ్లావత్ నాగులు నాయక్, కళావత్ చిన్నా నాయక్, బాణావత్ బాలు నాయక్, మేరాజోత్ చంద్రనాయక్, కేతావత్ అంజి నాయక్, మేరాజోత్ అంజనికుమార్ నాయక్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం


ఏపీటీఎఫ్ పుస్తకాన్ని అందజేస్తున్న మంజుల


శావల్యాపురం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) యూనియన్ సారథ్యంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల అన్నారు. సోమవారం మండలంలోని పోట్లూరు, శావల్యాపురం తదితర ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మంజుల మాట్లాడుతూ గత 76 సంవత్సరాల నుంచి ఏపీటీఎఫ్ సారథ్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అనేక ఉద్యమాలు పోరాటాల చేసిందన్నారు. సమావేశంలో జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షులు ఉస్మాన్, సెక్రటరీ యం.శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు గురుబాబు, సెక్రటరీ మహేంద్ర కృష్ణ, హెచ్ఎం బోడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, అబ్దుల్లా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కివచ్చిన ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపాల్ మృతికేసు

- వివాహేతర సంబంధమే హత్యకు దారితీసినట్లు గుర్తింపు
- నిందితుడి కోసం గాలింపు

దాచేపల్లి: ఇటీవల సంచలనం సృష్టించిన ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపాల్ గుమ్మడి నాగిరెడ్డి అనుమానాస్పద మృతి .. హత్యకేసుగా మలుపు తీసుకుంది. నాగిరెడ్డి హత్యకు గురైనట్లుగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఓ మహిళ, ఆమెతో వివాహేతర సంబంధం ఉన్న వ్యక్తి నాగిరెడ్డిని హత్య చేసినట్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 1వ తేదీన రాత్రి 11గంటల సమయంలో ఓ మహిళతో ఫోన్ సంభాషణ తరువాత నాగిరెడ్డి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. దాచేపల్లి సమీపంలోని ఓ వెంచర్ వద్దకు నాగిరెడ్డి చేరుకున్న తరువాత సదరు వివాహిత కూడా అక్కడకు వెళ్లింది. ఈ క్రమంలో ఆమెతో వివాహేతర సంబంధం ఉన్న వ్యక్తి కూడా ముందస్తు ప్రణాళికతో అక్కడే దాగిఉన్నాడు. నాగిరెడ్డి మహిళతో మాట్లాడుతున్న క్రమంలో వివాహేతర సంబంధం ఉన్న వ్యక్తి రాయితో నాగిరెడ్డి తలపై మోది హత్య చేసినట్లుగా గుర్తించారు. ఈ కేసును పోలీసులు తొలుత అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో హత్యగా తేలటంతో హత్య కేసుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. సదరు మహిళ ఇచ్చిన సమాచారం, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే ఆ మహిళతో పాటుగా నిందితుడిని కూడా అరెస్ట్ చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. వీరిద్దరికి ఇంకెవరైనా సహకరించారా అనే కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.

ధరణికోటలో యువకుడి హత్య


నర్రా భార్గవ్ మృతదేహం

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామానికి చెందిన యువకుడిని బంధువులే హత్య చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈసంఘటనపై అమరావతి సీఐ ఎ.వి.బ్రహ్మం అందించిన సమాచారం ప్రకారం ధరణికోట గ్రామానికి చెందిన నర్రా భార్గవ్(30)ను చిన్నప్పుడే తల్లి చనిపోవటంతో అమరావతిలో ఉంటున్న పెద్దమ్మ నూతలపాటి చిట్టెమ్మ పెంచి పెద్ద చేసి వివాహం కూడా చేసి ధరణికోటలో నివాసం ఉండేవిధంగా ఏర్పాటు చేసింది. చిన్ననాటి నుంచి భార్గవ్ చెడు అలవాట్లకు లోనై అల్లరిచిల్లరిగా తిరుగుతుండేవాడు ఈక్రమంలో నాలుగు నెలల క్రితం భార్యకూడా పుట్టింటికి వెళ్లింది. కొద్దికాలం క్రితం పెద్దమ్మ నూతలపాటి చిట్టెమ్మ పేరుమీద ఉన్న పొలంలో కొంత భాగం భార్గవ్ తనపేరు మీద రాయించుకుని, అమ్ముకుని జల్సాలు చేశాడు. అలాగే మళ్లీ ఆదివారం రాత్రి అమరావతిలోని చిట్టెమ్మ నివాసానికి వచ్చి డబ్బు కోసం హింసిస్తున్న తరుణంలో చిట్టెమ్మ కుమారుడు నూతలపాటి శ్రీనివాసరావుతోపాటుగా అతని బాబాయి నంబూరు శ్రీనివాసరావులు వచ్చి భార్గవ్‌పై దాడిచేశారు. దిండు ముఖంపై ఉంచి నొక్కడంతో ఊపిరాడక భార్గవ్ చనిపోయాడు. ఈనేపథ్యంలో వీరిద్దరూ భార్గవ్‌కు చెందిన బుల్లెట్ బండిని ధరణికోట ఆరుడొంకల బావిసెంటర్ సమీపంలో ఉన్న ఎన్ఎస్‌పీ కాలువ కట్టపై ఉంచి భార్గవ్ మృతదేహాన్ని ధరణికోటలోని అతని నివాసం వద్దకు తీసుకువచ్చి తాత నర్రా ఉమామహేశ్వరరావుకు అప్పగించి ఆరుడొంకల బావి దగ్గర కాలువ కట్టపై చనిపోయి ఉన్నాడని, తాము తీసుకువచ్చామని నమ్మబలికారు. వీరిద్దరి ధోరణిపై అనుమానంతో సోమవారం ఉదయం ఉమామహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉమామహేశ్వరరావు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టగా నూతలపాటి శ్రీనివాసరావు, నంబూరు శ్రీనివాసరావులు హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం నిందితులు ఇద్దరూ పరారీలో ఉండగా వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించారు. మృతునికి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు.